ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 27 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:30 సహర్ 4:55
(గురువారం సాయంత్రం) (శుక్రవారం ఉదయం)

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించాలి 8

ప్రయాణ కష్టాలు

పెరిగిన ప్రయాణికులు.. సరిపోని సౌకర్యాలు

ఆంధ్రజ్యోతి విజిట్



రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నుంచి మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిట లాడుతున్నాయి. ఎప్పుడో నిర్మించిన బస్టాండ్లను విస్తరించక పోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. వివిధ రూట్లలో బస్సుల సంఖ్య పెరిగినప్పటికీ ప్లాట్‌ ఫాంలు పెరగలేదు. తాత్కాలికంగా రేకుల షెడ్లు వేసినా తగినన్ని ఫ్యాన్లు లేక ప్రయాణికులు ఉక్కపోతను భరించలేక పోతున్నారు. బస్టాండ్లలో శాశ్వతంగా మంచినీటి సౌకర్యం లేక వేసవి కాలంలో ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపడాలని, ప్రాంగణాల చుట్టూ చెట్లు పెంచాల్సిన అవసరం ఉందని 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో పలువురు వెల్లడించారు.

పెద్దపల్లి బస్టాండ్‌లో ప్లాట్‌ఫాం కొరత

పెద్దపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముప్పయేళ్ల క్రితం నిర్మించిన పెద్దపల్లి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్లాట్‌ఫాంలను పెంచక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కరీంనగర్, గోదావరిఖని, మంథని వైపునకు వెళ్లే ప్లాట్ ఫాం మాత్రమే ఉన్నాయి. మంథని ప్లాట్‌ఫాం పక్కన ధర్మారం, కమ్మరిఖంపు, ధైటిలక్షయిన్ కాలనీ, కాల్వశ్రీరాంపూర్, ఓదెల వైపునకు వెళ్లే బస్సుల కోసం అదనంగా ఓపెన్ ప్లాట్ ఫారాలు నిర్మించినప్పటికీ అక్కడ ప్రయాణికులు కూర్చునేందుకు సౌకర్యాలు లేవు. ఎండకు ఎండాలి, వర్షానికి తడవాల్సిందే. వివిధ రూట్లలో బస్సులు పెరగడంతో బస్టాండ్‌లో ఉన్న కుర్చీలు సరిపోవడం లేదు. బస్టాండ్ విస్తరించక చాలా మంది ప్రయాణికులు నిలబడాల్సి వస్తున్నది. బస్టాండ్‌లో శాశ్వతంగా మంచినీటి సౌకర్యం లేదు. ఒక నల్లా ఉన్నప్పటి టీకీ, దానికి బోర్ ద్వారా నీళ్లు వస్తాయి. ఆ బోర్ నీటిని తాగే పరిస్థితి లేదు. పెద్దపల్లి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఒక వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. వేసవి కాలం వచ్చిందంటే ఆసోసి యేషన్ వాళ్లు ప్యూరిఫైడ్ వాటర్ను సరఫరా చేస్తున్నారు. అలాగే పెద్దపల్లి మున్సి పాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తారు. బస్టాండ్‌ను విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పెద్దపల్లిలో ఎండలోనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

అదనపు ప్లాట్‌ఫాంల వద్ద చలువ పందిళ్లు వేయాలి

- మదనయ్య, దొంగతుర్తి



గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఆగే ఓపెన్ ప్లాట్ ఫారాల వద్ద నిలువ నీడ లేదు. వేసవి కాలం కావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. బస్టాండ్ విస్తరించే వరకు వేసవి కాలం పూర్తయ్యే వరకు ఆర్టీసీ అధికారులు స్పందించి తాత్కాలికంగా చలువ పందిళ్లు వేయించాలి.

గోదావరిఖనిలో సరిపోని ప్లాట్‌ఫాంలు

కళ్యాణ్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో నిర్మించిన గోదావరిఖని బస్టాండ్ ఇప్పటి వరకు విస్తరణకు నోచుకోవడం లేదు. కార్మిక క్షేత్రమైన గోదావరిఖని బస్టాండ్‌లో వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫాంల సంఖ్య తక్కువగా ఉండడంతో సీట్లు లేక ప్రయాణికులు కూర్చోవడానికి ఇబ్బందిగా మారింది. రెండు సంవత్సరాల క్రితం భూపాలపల్లి, కాళేశ్వరం, పర్కాల, వరంగల్, భద్రాచలం ప్లాట్‌ఫాంలను రేకుల షెడ్డుతో నిర్మించి ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో ఆర్టీసీ అధికారుల విజ్ఞప్తి మేరకు జెన్‌కో అధికారులు ఆరేసిఫ్యాన్లారు. ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకటే ఆర్‌ఓ ప్లాంట్ ఉండని, మరో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి దాహార్తి తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రయాణికులు కూర్చునే చోటనే తినుబండారాల విక్రయాల స్టాల్స్ ఏర్పాటు చేయడంతో ఇబ్బందిగా మారింది. బస్టాండ్ ఆవరణలో వ్యాపారాల కోసం రూంలు ఏర్పాటు చేసినప్పటికీ అందులో వ్యాపారం నిర్వహించకుండా బయట బస్టాండ్ ఆవరణలో వ్యాపారాలు చేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఫ్యాన్లు తిరగడం లేదు. బస్టాండ్ ఆవరణలో ఉన్న టాయిలెట్స్ సరిగా శుభ్రం చేయక దుర్వాసన వస్తోంది.



నూతనంగా ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాంలో కనిపించని ఫ్యాన్లు

ప్లాట్‌ఫాంలను విస్తరించాలి

శంకర్, ప్రయాణికుడు



బస్టాండ్‌లో రద్దీ పెరిగింది. రద్దీకి అనుగుణంగా ప్లాట్‌ఫాంలు నిర్మించాలి. వ్యాపారాలు బస్టాండ్ మధ్యలో జ్యూస్ బండి, వాటర్, తినుబండారాలు విక్రయిస్తున్నారు. వారికి కేటాయించిన గదుల్లో వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలి. వినోదం కోసం టీవీలను ఏర్పాటు చేయాలి.

మరో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి

శ్రీనివాస్, పొట్యాల



వేసవి దృష్ట్యా మరో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి. ప్రయాణికులు కూర్చునే విధంగా సీట్ల సంఖ్య పెంచాలి. మూత్రశాలలు దుర్వాసన వస్తున్నాయి. గంటకోసారి వాటిని శుభ్రం చేయాలి. ప్రయాణికులకు వసతులు కల్పించాలి.

బస్సుల సంఖ్య పెంచాలి

మంథని: మంథని ఆర్టీసీ బస్సు డిపోలో బస్సు సర్వీసుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. మంథని ఆర్టీసీ బస్టాండ్‌ను బుధవారం 'ఆంధ్రజ్యోతి' సందర్శించింది. డిపోలో బస్సుల సంఖ్యతో పాటు కొత్తగా రూట్లలో బస్సులు నడిపిస్తే ప్రయాణికులు ఇబ్బంది లేకుండా ఉంటుందం టున్నారు. జమ్మికుంట, బాసర బస్సుల సర్వీసులను పునరుద్ధరించాలని, విజయవాడ, తిరుపతి, యాదగిరిగుట్ట లాంటి పుణ్యక్షేత్రాలకు మంథని బస్సులు నడిపే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. తాడిచర్ల, అరెంద, భూపాలపల్లి, గోదావరిఖని, పెద్దపల్లి రూట్లు బస్సుల సంఖ్య సరిపోక సాయంత్రం నుంచి రాత్రి వరకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెబుతున్నారు. రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకు కరీంనగర్, గోదావరిఖని, భూపాలపల్లి నుంచి బస్సులు నిర్ణీత సమయంలో నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బస్టాండ్ ఆవరణలో నీడ నిచ్చే మొక్కలు నాటాలని, గ్రీనరీ కోసం మినీ పార్కు, పూల మొక్కలు పెంచాలని కోరుతున్నారు. బస్టాండ్‌లో స్కూల్, కళాశాల సమయంలో పోకిరీల బెడద ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో పోలీసులు, షీటీం నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.



మంథని బస్టాండ్

హైదరాబాద్‌కు ఎలక్ట్రిక్ బస్సులు నడపాలి

- ఇనపల్లి కొమురయ్య, రిటైర్డ్ ఉద్యోగి, మంథని.



మంథని నుంచి హైదరా బాద్‌కు ఎలక్ట్రిక్ బస్సులు ఇంకా నడపడం లేదు. ఈ బస్సుల్లో ప్రయాణం సౌకర్యవంతంగా ఉం టుంది. మంథని నుంచి హైదరాబాద్‌కు నడిపిస్తే చాలా బాగుంటుంది. ఛార్జి రాకుండా, అలిసి పోకుండా ఉంటాం. భూపాలపల్లి, గోదావరిఖని రూట్లలో సైతం నడిపించాలి. మంథని డిపోకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

సుల్తానాబాద్‌లో నిర్వహణ కరువు

సుల్తానాబాద్: నిత్యం ప్రయాణికులతో సందడిగా ఉండే సుల్తానాబాద్ బస్టాండ్ నిర్వహణ లేక అధ్వాన్నంగా మారింది. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన బస్టాండ్ ప్రస్తుతం ప్రయాణికుల అవసరాలు తీర్చడం లేదు. మూత్ర శాలలు, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్య పనులు సరిగా లేవని ప్రయాణికులు పేర్కొంటున్నారు. రక్షణ లేక బస్టాండ్ ఆవరణలో నిలిపిన వాహనాలు చోరీకి గురవుతున్నాయి. దొంగల బెడద ఎక్కువైంది. సీసీ కెమెరాలు లేక దొంగలు ప్రయాణికుల సెల్‌ఫోన్లు, వస్తువులు చోరీ చేసిన సందర్భంగా వారిని పట్టుకోవడం ఇబ్బందిగా మారింది. నెల రోజుల్లో ఆరు బైక్‌లు చోరీకి గురైనట్లు బాధితులు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. బస్టాండ్ పక్కనే వైన్స్ పర్మిట్ రూమ్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



సుల్తానాబాద్ ఆర్టీసీ బస్‌స్టేషన్

డిపో మారడం వలన పనులు పెండింగ్

జె. రమేష్, కంట్రోలర్, సుల్తానాబాద్




ఇటీవల సుల్తానాబాద్ బస్టాండ్‌ను కరీంనగర్ టూ నుంచి గోదావరిఖని పరిధిలోకి మార్చారు. దాంతో ఈ బస్టాండ్‌లో మార్పులు చేర్పులు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అసౌకర్యాల గురించి, సీసీ కెమెరాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్యలు పరిష్కారం అవుతాయి.

నిధులు లేవు.. అభివృద్ధి లేదు

- పంచాయతీల్లో కుంటుపడుతున్న పాలన
- విడుదల కాని 15వ ఆర్థిక సంఘం నిధులు
- పంచాయతీ కార్యదర్శుల ఇబ్బందులు





(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గ్రామ పంచాయతీలకు నిధులు కరువ య్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావా ల్సిన గ్రాంటు రాకపోవడంతో అభివృద్ధి, పరిపాలన కుంటుపడుతున్నది. స్థానికంగా వచ్చే పన్నుల ఆదారంగానే జీత భత్యాలు చెల్లిస్తున్నారు. అత్యవ సర పనులకు పంచాయతీల్లో ఒక్క రూపాయి లేక పాలన ఎలా చేయాలని పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. తాగునీటి ఎద్దడి నివా రణ, మరమ్మతు పనులకు మిషన్ భగీరథ నుంచి నిధులు రాక పోగా పంచాయతీలపై మీదే భారం మోపారు. దీంతో కొన్ని చోట్ల అత్యవసర పనులకు పంచా యతీ కార్యదర్శులు సొంతంగా నిధులు వెచ్చిస్తున్నారు. గత ఏడాది వేసవిలో క్రిటికల్ గ్యాప్స్ పనులకు కోటి 80 లక్షల రూపాయలు ప్రభు త్వం మంజూరు చేసింది. ఆ పనులు చేసి వేసవిలో ప్రజలకు తాగు నీటి ఎద్దడి లేకుండా చేసినప్పటికీ, నేటికీ కూడా ఆ పనులకు సంబం ధించిన బిల్లులు ఇంత వరకు విడుదల కాలేదు. ఏడాది కాలంగా పంచాయతీల్లో ప్రత్యేక అధికా రుల పాలన కొనసాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభు త్వం విడుదల చేసే స్టేట్ ఫైనాన్స్ నిధులు విడుదల కాకపోవడంతో పంచా యతీల్లో అభివృద్ధి కుంటు పడింది. ఇందుకు కారణం ఏడాది కాలంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడమేనని విమర్శలు వస్తున్నాయి.

ఏడాదిగా ప్రత్యేక అధికారుల పాలన

గత ఏడాది జనవరి నెలాఖరు వరకు గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగి సింది. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. జూలైలో మండల పరిషత్, జిల్లా పరిషత్ లు, ఈ ఏడాది జనవరిలో మున్సి పాలిటీల పాలక వర్గాల పదవీ కాలం ముగిసింది. అన్ని స్థానిక సంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసా గుతున్నది. పాలక వర్గాలు ఉన్నంత కాలమే కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. ఆ తర్వాత నుంచి నిధుల విడుదలను నిలిపి వేసింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమా వేశాల్లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంగళవారం ప్రశ్నోత్త రాల సమయంలో స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధుల విడు దలపై ప్రశ్నించారు. ఇం దుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ చట్టబద్ధంగా ఎన్నికైన స్థానిక సంస్థ లకే నిధులు విడుదల చేస్తామని, పంచాయతీలకు 2023-24లో 15వ ఆర్థిక సంఘం కేటాయించిన గ్రాంటు విడుదల వాయిదా పడిందని స్పష్టం చేశారు. ఏడాది కాలంగా పంచాయతీ ఎన్నికలు, ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించక పోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడుతున్నది. ఏడాది క్రితం ఆయా పాలక వర్గాలు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక సతమతం అవుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికే ఆర్థిక సంఘం నిధులు

పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేయడంతో పాటు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు నీతి ఆయోగ్ ద్వారా జనాభా ప్రాతిపదికన ప్రతి ఏటా నిధులను కేటాయి స్తారు. ఆ నిధులతో పంచాయతీల్లో విద్యుత్ చార్జీలు చెల్లింపు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు చేపడుతుంటారు. గతంలో ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వా నికి పంపిస్తే అక్కడి నుంచి పంచాయతీలకు పంపిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో పంచా యతీలకు నిధులు విడుదల చేయడం లేదని భావించిన కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్ల నుంచి ప్రత్యేక బ్యాంకు ఖాతాలు తెరిపించి నేరుగా ఆ ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. ఈ ఆర్థిక సంఘం 2021-22 నుంచి 2025-26 ఉంటుంది. ప్రతి ఏటా నాలుగు విడతల్లో నిధులను విడుదల చేస్తారు. ప్రతి ఏటా ఒక్కో పంచాయతీకి జనాభాను బట్టి 15వ ఆర్థిక సంఘం ద్వారా 5 నుంచి 40 లక్షల రూపా యల వరకు నిధులు వస్తున్నాయి. ఈ నిధులతో పంచాయతీల నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు సద్విని యోగం చేసుకున్నారు.

ఇటుక బట్టీల్లో నిబంధనలు పాటించాలి

● పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య

పెద్దపల్లిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇటుక బట్టీల నిర్వాహణలో నిబంధనలు తప్పకుండా పాటించాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో ఇటుక బట్టీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనలు, ఉత్తర్వులు, ఇటుక బట్టీల నిర్వాహణలో పాటించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధి కారి వీర బుచ్చయ్య, జిల్లా పరిశ్రమల అధికారి, మైనింగ్ శాఖ ఉప సం చాలకులు, లేబర్ అధికారి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూసాలలో బొడ్రాయి ఉత్సవాలు

సుల్తానాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ విలీన గ్రామమైన పూసాలలో బుధవారం బొడ్రాయి ఉత్సవాలు నిర్వహిం చారు. గ్రామ దేవతలు భూలక్ష్మి, మహాలక్ష్మి, పోచమ్మ తల్లులకు బోనాలు సమర్పించారు. బుధవారం ఉదయం గ్రామంలో అన్ని కులసంఘాలకు చెందిన వారు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. కార్యక్ర మంలో మాజీ జడ్పీటీసీ గుర్రాల మల్లేశం, వల్స నీలయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, పురం ప్రేమ్ చందర్ రావు, వేగోళం మల్లేశం, కంకనాల ఆశాలు, వేయిగండ్ల నరేందర్, తిరుపతి, శ్రీను, కొయ్యడ రమేష్, పురం రమణసతీష్ కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని వార్డుల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందికి పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ ఆకుల వెంకటేష్ కోరారు. కమిష నర్ పలు వార్డుల్లో పర్యటించిన అనంత రం మాట్లాడుతూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ప్రతిరోజు రెండు వార్డుల్లో శానిటేషన్ డ్రైవ్ చేస్తున్నామని తెలిపారు. చెత్త రిక్షాలకు చెత్తను, ప్లాస్టిక్ కవర్లను, సీసాలను వేయవద్దని అవగాహన సూ చించారు. అమర్‌నగర్ నుంచి పెద్ద మజీద్ వరకు జరుగుతున్న అమృ త్2 పైపులైన్ పనులను ఏఈ సతీష్‌తో కలిసి పరిశీ లించారు.

ఢిల్లీ ధర్నాలో పెద్దపల్లి యూత్ కాంగ్రెస్ నాయకులు


పెద్దపల్లిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడిలో పెద్దపల్లి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూ రి అవినాష్‌తో పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సంవత్స రానికి రెండు కోట్ల ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం లేకుండా చేస్తా అని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ యువతకు అన్యాయం చేశారని అన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గం రద్దు

పెద్దపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మంగళవారం ప్రకటించిన బీజేపీ జిల్లా కార్యవర్గం రద్దయినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకు న్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గం ప్రకటిస్తా మని తెలిపారు.

గోదావరిఖనిలో న్యాయవాదుల రిలే దీక్ష

కోల్‌సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చంపాపేటలో న్యాయ వాదిని హత్య చేసిన దోషులను వెంటనే అరెస్టు చేయాలని, అడ్వకేట్ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, 41ఏ సీఆర్ పీసీ (బీఎన్ఎస్ఎస్ 30(3)ని) సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ గోదావరి ఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కోర్టు ఎదుట న్యాయవాదులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సందర్భం గా రోజు రోజుకు న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, గతంలో వామన్‌రావు దంపతుల హత్య, ఇటీవల ఇజ్రాయేలు హత్య దీనికి ఉదాహరణ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో న్యాయ వాదుల రక్షణ బిల్లును ప్రవేశపెట్టాలని, న్యాయవాదులకు గుదిబండగా ఉన్న సెక్షన్ 30(3)ని సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు తౌటం సతీష్, గోపిక ప్రకాష్, జగురుకుర్ల మహేందర్, సంతోష్, మేడ చక్రపాణి, గోపాల్‌రెడ్డి, గొర్రె రమేష్, నడిపెల్లి కిషన్ రావు, చందాల శైలజ, దేశెట్టి అంజయ్య, గుళ్ళ రమేష్, పులిపాక రాజకుమార్ పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న న్యాయవాదులు

దీక్షలకు బీజేపీ మద్దతు

న్యాయవాదులు చేస్తున్న దీక్షలకు బీజేపీ మద్దతు ప్రకటించింది. బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి దీక్ష శిబిరాన్ని సంద ర్శించి న్యాయవాదుల ఆందోళనకు మద్ద తు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, రాష్ట్రంలో చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మద్దతు తెలిపిన వారిలో కోమటి రమేష్, గుండబోయిన భూమయ్య, అండె రాజ్‌కుమార్, ఆంధ్ర వీరేశం తదితరులు ఉన్నారు.

తండ్రి మృతిని తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య

కోల్‌సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో తండ్రి మరణించడంతో తట్టుకోలేక మానసిక క్షోభతో అతని కుమారుడు గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన ఆచంట శివశంకర్(42) బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివశంకర్ ఎన్‌టీపీసీలో క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. అతని తండ్రి 20రోజుల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆందోళనకు గురయ్యాడని, బుధవారం ఇద్దరు పిల్లలను స్కూల్‌లో దిగబెట్టిన శివశంకర్ ఇంటికి వచ్చాడని, అప్పటికే భార్య టైలరింగ్ చేసేందుకు బయటికి వెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లహరి అలియాస్ వెంగమాంబ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూమేష్ పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం


నవీన్ (ఫైల్)

ధర్మారం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్యహత్య చేసుకున్న ఘటన కొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నెరువట్ల నవీన్ (29) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నవీన్ ప్రవర్తనతో విసుగు చెందిన అతని భార్య పిల్లలు ఇల్లు వదిలివెళ్లిపోయారు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న నవీన్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిచంగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి తమ్ముడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ శీలం నరేష్ తెలిపారు.

పాఠాలు చెబుతూ కుప్పకూలిన టీచర్

● ఆసుపత్రిలో మృతి


అనురాధ(ఫైల్)

మల్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న బోగ అనురాధ(43) అనే ఉపాధ్యాయురాలు బుధవారం గుండె పోటుతో కుప్పకూలి మృతి చెందింది. అనురాధ భోజన విరామం అనంతరం విద్యార్థులకు పాఠాలు చెబుతుండగానే గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పాఠశాల యాజమాన్యం వెంటనే అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేక గుండెపోటుతో మృతిచెందింది. ఉపాధ్యాయురాలి మృతితో పాఠశాలలో విషాదం నెలకొంది.

రిజర్వాయర్‌లో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

గొల్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగదాముసిపల్లె రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి చెరువులో మంగళవారం గల్లంతైన బాలుడు నేరెళ్ల నరేష్(12) మృతదేహం బుధవారం లభ్యమైంది. రంగదాముసిపల్లె గ్రామంలో నేరెళ్ల లక్ష్మీ-పోచయ్య దంపతుల చిన్న కొడుకైన నరేష్ స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి మంగళవారం రంగదాముసిపల్లె రిజర్వాయర్‌లోకి సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా, తనకు ఈత రాకపోవడంతో నరేష్ మరోచోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు. ఈత నేర్చుకునేందుకు నీటిలోకి దిగిన నరేష్ ఎంతసేపటికీ పైకి రాకపోవడంతో గమనించిన మిత్రులు భయంతో ఊరిలోకి పరుగులు తీసికుటుంబ సభ్యులకు సమాచారమందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ రంగదాముడిపల్లె రిజర్వాయర్‌లోకి గజఈతగాళ్లను దింపి బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మృతదేహం లభ్యమైంది. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల జిల్లాప్రధానాసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాడలేని సెంట్రల్ లైటింగ్

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ● రాత్రి సమయాల్లో ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు


సెంట్రల్ లైటింగ్ లేకుండా ఉన్న నందికమాన్-కలెక్టరేట్ రోడ్డు

వేములవాడ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక వాహనదారుల సౌకర్యార్థం నాలుగు వరసల రోడ్డును ఏర్పాటుచేసినా సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయం జంక్షన్ నుంచి వేములవాడకు వచ్చే నందికమాన్ వరకు నాలుగు వరుసల రోడ్డు వేసి మధ్యలో పూలమొక్కలను నాటి అందంగా తీర్చిదిద్దారు. అయితే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకోవడంతో రాత్రి సమయంలో వెలుతురు లేక ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు, భక్తులు వాపోతున్నారు.

తప్పని ఇబ్బందులు..

జిల్లా కేంద్రం నుంచి వేములవాడకు వచ్చే వాహనాలు లైటింగ్ లేకపోవడంతో వాహనాదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు హైదరాబాద్ నుంచి సిరిసిల్ల మీదుగా రాజన్న దర్శనానికి నిత్యం వేల సంఖ్యలో వాహనాల్లో ఆలయానికి వస్తున్నారు. అయితే రాత్రి సమయంలో వచ్చే భక్తులు లైటింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నందికమాన్, గుర్రంవానిపల్లి, అగ్రహారం, చంద్రగిరి గ్రామాలకు చెందిన స్థానికులు రాత్రి సమయంలో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టరేట్ నుంచి నందికమాన్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, నందికమాన్ నుంచి కొడుముంజ గ్రామం వరకు నాలుగు వరుసల రోడ్డు పూర్తి అయినా మధ్యలో పూల మొక్కలు నాటి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో ఇబ్బందులు.. నాగుల రాము, సంకెపల్లి



నందికమాన్ నుంచి సిరిసిల్ల వెళ్లే రోడ్డులో రాత్రి సమయంలో చీకటిమయంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుర్రంవానిపల్లి సమీపంలో పాదచారులు నడుచుకుంటూ రోడ్డు దాటితే కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

లైటింగ్ ఏర్పాటు చేయాలి..: నేరెళ్ల కిరణ్, తిప్పాపూర్



రాజన్న ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివస్తారు. సెంట్రల్ లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి లైటింగ్ ఏర్పాటు చేసి స్థానికులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

కట్నం కోసం వేధించిన భర్త, అత్తమామలపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధించిన సంఘటనలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన పోతుల రాజిరెడ్డితో పాటు అతని తల్లిదండ్రులు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని శిరీషకు కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేటకు చెందిన రాజిరెడ్డితో నాలుగేళ్ల కిందట వివాహమైందన్నారు. ఆ సమయంలో పుట్టింటి వారు రూ.2 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు ఇచ్చి పెళ్లి జరిపించారని చెప్పారు. కొంతకాలం తర్వాత భర్త రాజిరెడ్డి, అత్తమామలు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలు పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని శిరీషను వేధింపులకు గురి చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త రాజిరెడ్డి, అత్తమామలు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

వ్యక్తిపై దాడి కేసులో ఏడాది జైలు శిక్ష

సిరిసిల్లక్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి కేసులో ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు టౌన్ సిరిసిల్ల సీఐ కె కృష్ణ తెలిపారు. సీఐతెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లపట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అంకారపు ప్రభాకర్ ఇంటికి ఉన్న టులెట్ బోర్డును 4 జూన్ 2017న పాత పగలు దృష్టిలో పెట్టుకొని ఇంటి పక్కన ఉన్న కాముని వనిత, కాముని అరుణ, వడ్డేపల్లి సుజాత అనేముగ్గురు తొలగించారు. దీంతో దుర్భాషలాడుతూ ప్రభాకర్ కర్రతో దాడి చేశాడని కాముని వనిత సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు అప్పటిసిరిసిల్ల ఏఎస్ఐ అనంతరెడ్డి అంకారపు ప్రభాకర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రావణ్ ఆధ్వ ర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేష్ పదిమంది సాక్షు లను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించగా, కేసుపూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎ.ప్రవీణ్ నేరరుజువు కావడంతో నిందితుడైన అంకారపు ప్రభాకర్‌కు ఒక సంవత్సరం జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించినట్లు సిరిసిల్ల సీఐ కె కృష్ణ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న రెండువాహనాలను వేర్వేరుప్రదేశాల్లో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. వెంకట్రావుపల్లె గ్రామంలోని కెనాల్ సమీపంలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని నిందితుడైన మల్కినగేష్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలోని కందికట్కూర్ గ్రామసమీపంలో ఇసుకను తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కందికట్కూర్ గ్రామానికి చెందిన దొమ్మాటి అజయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏఈవోకు గాయాలు

తంగళ్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్ళపల్లి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఈవో అనూషకు గాయాలయ్యాయి. కట్కూర్ఏఈవో అనూష విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా తంగళ్లపెల్లి మండలకేంద్రంలో కారుఢీకొని స్వల్పంగా గాయాలయ్యాయి.

ఖర్చుల కోసం చోరీలు

● మహిళ నుంచి బంగారం, నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

పెద్దపల్లిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఖర్చుల కోసం ఓ మహిళ చోరీ మార్గాన్ని ఎంచుకుంది. భర్త ఎనిమిదేళ్ల క్రితం మరణించడంతో కొన్నాళ్లపాటు హోటల్‌లో పనిచేసి తన ఇద్దరు కూతుళ్ల వివాహంచేసింది. అప్పులు తీర్చలేక, ఇంటి అవసరాలు వెళ్లదీయలేక దొంగగా మారింది. ఓబంగారం షాపులో చోరీకి పాల్పడి 24గంటల్లో పోలీసులకు చిక్కి కటకటాల పాలైంది. ఈఘటనకు సంబంధించి డీసీపీ పీ కరుణాకర్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన లోకిని తిరుమల సోమవారం పట్టణంలోని దేవరకొండ కరుణాకర్ బంగారు ఆభరణాల షాపులో దొంగతనానికి పథకం వేసింది. వెంట సుత్తి, స్క్రూడ్రైవర్ తీసుకువెళ్లి షెట్టర్ తాళం పగుగొట్టి తెరిచింది. కౌంటర్లకు తాళం వేసి ఉండగా స్క్రూ డ్రైవర్‌తో తెరిచి 100గ్రాముల బంగారం, 40వేల రూపాయల నగదు దోచుకెళ్లింది. యజమాని కరుణాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఏసీపీ గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు మల్లేష్, సిబ్బందితో ఒబృందంగా ఏర్పడి క్లూస్‌టీం ఫింగర్ ప్రింట్స్ సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఓ మహిళ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే తిరుమలను అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం ఒప్పుకుంది. ఆమెనుంచి 100గ్రాముల బంగారం నగదు 28వేలరూపాయలు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ టాస్క్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించారు. వ్యాపారులు, ఇంటియజమానులు సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి, ప్రభాకర్, అనిల్‌కుమార్, రాజు, రమేష్ ఉన్నారు.

తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు మృతి

సైదాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి కింద పడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల కనకయ్య (54)అనేగీతకార్మికుడు వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారీకిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

వివాదాస్పదమైన ఎస్సెస్సీ ఇన్విజిలేషన్

● కుమార్తె పరీక్ష కేంద్రంలో తండ్రి విధులు

కోరుట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కోరుట్లలోని గౌతమ్ మోడల్‌స్కూల్ పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేషన్ వివాదస్పదంగా మారింది. కుమార్తె పరీక్ష కేంద్రంలో తండ్రి ఇన్విజిలేటర్ నిర్వహించడం చర్చనీయాంశమైంది. పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో ఓ పదో తరగతి విద్యార్థినికి పరీక్ష కేంద్రం కేటాయించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కోరుట్ల పట్టణంలో పనిచేస్తున్నారు. వారికి కూతురు పరీక్షరాస్తున్న కేంద్రంలో ఇన్విజిలేటర్లుగా విధులునిర్వహించడానికి ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 21నతెలుగు పరీక్షకు ఎక్కువమంది సిబ్బందిని విధులకు కేటాయించడంతో విద్యార్థిని తల్లికి విధులు కేటాయించలేదు. తండ్రిమాత్రం ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహించాడు. ఇంగ్లీష్ పరీక్షరోజు కూడా ఆయన విధులకు హాజరయ్యాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిల్లలు పరీక్ష రాసే కేంద్రాల్లో తల్లిదండ్రులతో పాటు వారి బంధువులు ఎవరు ఉన్నా ఇన్విజిలేషన్‌కు అనుమతించరు. ఇందుకుగాను ఉపాధ్యాయులు ముందే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. సదరు ఉపాధ్యాయులు తమ కూతురు పరీక్ష రాసే విషయం తెలపకపోవడంతో వారికి విధులు కేటాయించారు. ఈ విషయం ఆలస్యంగా ఈనెల 24న బయటపడినట్లు సమాచారం. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న తోటి ఇన్విజిలేటర్లు ఈ విషయం మండల విద్యాధికారికి నరేశంకు తెలవడంతో వెంటనే సెంటర్‌కు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. సదరు ఇన్విజిలేటర్ నుంచి ఎంఈవో డిక్లరేషన్ తీసుకొని ఉన్నతాధికారులకు నివేదించారు.

● ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ జారీ

కోరుట్ల రూరల్: ఎస్సెస్సీ పరీక్షలో ఇన్విజిలేషన్ వివాదస్పదంపై సదరు ఉపాధ్యాయుడికి బుధవారం జిల్లా విద్యాధికారి రాము షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు మండల విద్యాధికారి నరేశం తెలిపారు. పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రంలో తన కూతురు పరీక్ష రాస్తున్న విషయంలో జరుగుతున్న వివాదంపై జిల్లా విద్యాధికారి కార్యాలయానికి వచ్చి గురువారం వివరణ ఇవ్వాలని ఇవ్వాలని షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నట్లు ఎంఈవో తెలిపారు.

అన్నారంలో దొంగల బీభత్సం

● తాళం వేసిన ఇళ్లే లక్ష్యం ● మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, ఆభరణాలు చోరీ
● ఒక ఇంటిలో బైక్ అపహరణ ● రంగంలోకి దిగిన క్లూస్ టీం..


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న మూడు ఇళ్లల్లో దొంగలు పడి నగదు, వెండి, బంగారు ఆభరణాలు, బైక్‌ను దొంగిలించారు. ఒక కుటుంబం వారు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లారు. మరొక కుటుంబం వారు తన తమ్ముడి ఇంటిలో పడుకునేందుకు వెళ్లారు. మరో ఇంటిలో పడుకున్న మహిళ పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. రుద్రోజు వెంకటాచారి ఇంటిలో ముప్పావు తులం బంగారం, 18తులాల వెండి పట్టీలు, మధునాల వెంకటమ్మ ఇంటిలో 55తులాల వెండి పట్టీలు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. పాకాల రాజిరెడ్డి ఇంటి ఆవరణలో పెట్టిన బైక్ ఎత్తుకెళ్లారు. గొట్టిముక్కల విజయ పుస్తెల తాడును తెంపే క్రమంలో మేల్కొన్న మహిళ అరుస్తూ దొంగ వెంబడి పరుగెత్తింది. అయినా ఫలితం లేకపోయింది. బుధవారం సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ దొంగతనానికి గురైన ఇండ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. కరీంనగర్ క్లూస్‌టీం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. అనంతరం గ్రామపంచాయతీలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ మోటారు తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువు సమీపంలోని రైతులు చల్ల కిష్టారెడ్డితో పాటు మరో రైతుకు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ మోటారు తీగను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి అపహరించుకుపోయారు. సుమారు రూ.5వేల విలువ ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. చోరీపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు


పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్

కరీంనగర్ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో, ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం కొత్తపల్లి మండలం లోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా మద్యం పట్టుకు న్నారు. కొత్తపల్లి మండలం ఎలగందల్, బావుపేటలో నాలుగు బెల్ట్‌షాపులను సీజ్ చేశారు. రూ.26వేల విలువైన 40,735 లీటర్ల మద్యం పట్టుకున్నారు. నిర్వాహకులు రెడ్డివేని మనోహర్, దండు శంకరయ్య, గాలి రాజేష్, బోనాల దశరథంను అరెస్టు చేశారు.

మిర్చి యార్డులో దొంగతనం

● రూ.80వేలు చోరీ


యార్డులో వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

తిమ్మాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజీవ్ రహదారిపై ఉన్న తిమ్మాపూర్ ఎండుమిర్చియార్డులో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి కౌంటర్‌లో ఉన్న నగదును దొంగిలించారు. మిర్చి యార్డు నిర్వాహకుడు మడికంటి శ్రీనివాస్, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. శ్రీనివాస్ రోజులాగే మంగళవారం కూడా యార్డులో పనులు ముగించుకొని కరీంనగర్‌లోని ఇంటికివెళ్లాడు. బుధవారం ఉదయం ఉదయం తిరిగి యార్డుకు వచ్చిన క్రమంలో కౌంటర్ పగుల గొట్టి ఉంది. అందులో పెట్టిన నగదు లేకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై వివేక్‌తోపాటు క్లూస్‌టీం పోలీసులు మిర్చియార్డుకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. యార్డులోఉన్న సీసీ పుటేజ్ పరిశీలించగా అందులో ఇద్దరు దొంగలు వచ్చి డబ్బులు దొంగిలించుకు పోయినట్లు గుర్తించారు. రాత్రి మిర్చిలోడ్‌వస్తుందని శ్రీనివాస్ రూ.80వేలు కౌంటర్‌లో పెట్టి వెళ్లాడు. మిర్చిలోడ్ రాకపోవడంతో డబ్బులు అందులోనే ఉండిపోయాయి. వాటినే దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై తెలిపారు.

ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం



మాట్లాడుతున్న విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు విజయ


రామగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని కొండా లక్ష్మణ్ తెలంగాణరాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు డాక్టర్ విజయ పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన రత్నాపూర్ కృషి విజ్ఞానకేంద్ర 13వ శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రంలో సాగుతున్న పండ్ల తోటలు, కూరగాయల సాగును క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు గత సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలు, వచ్చే సంవత్సరం చేపట్టాబోయే కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరించారు. వ్యవసాయపంటల సాగుతో పోల్చుకుంటే ఉద్యానపంటలు పండ్లు,కూరగాయలు, పూలసాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని విజయ పేర్కొన్నారు. వాటికి అవసరమయ్యే శాస్త్ర,సాంకేతిక సహకారాన్ని విశ్వవిద్యాలయం అందిస్తుందని తెలిపారు. సమావేశంలో విశ్వవిద్యాయలం ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీధర్‌సిద్ధి, ఉషారాణి, వ్యవసాయసంయుక్త సంచాలకులు అంజనీదేవి, నాబార్డ్ ఏజీఎం ప్రకాశ్, పిడి డిఆర్‌డిఏ కలిందిని జిల్లా పశుపోషణ అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలు : సీఐ

కరీంనగర్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల వినియోగం అనర్థదాయక మని, యువత వాటిజోలికి వెళ్లవద్దని కరీంన గర్ మహిళాతాణా సీఐ పి శ్రీలత అన్నారు. ప్రభుత్వమహిళా డిగ్రీకళాశాలలో ఈరోజు మత్తుపదార్థాల వినియోగం-అనర్థాలపై అవగాహనసదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ శ్రీలత మాట్లాడుతూ లుక్సకంటే బుక్స్ గొప్పవని, తనఅనుభవాలను చెబుతూ విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. విద్యార్థులు మత్తుకు బానిసలుకాకుండా ఉజ్వలభవిష్యత్‌ను తీర్చిదిద్దుకో వాలన్నారు. ఒకసారి మత్తుకు బానిసగా మారితే అతని జీవితంతోపాటు కుటుంబం కూడా చిన్నాభిన్నం అవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి వరలక్ష్మి మాట్లాడుతూ మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల విలువైన జీవితాలను కోల్పోతూ, కుటుంబానికి, సమాజానికితీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నారని అన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో మత్తుపదార్థాల నిరోధకకమిటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొగిలి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కుక్క మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని పెంపుడు కుక్క మృత్యువాత పడింది. కుక్క యజమాని కంకణాల బాలలింగం ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలలింగం ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ మామిండ్ల వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ సమాచారం

ఇక మీ చేతుల్లో..

సుభాష్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల సమాచారం ఇక మీ చేతిలో అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు పెంచింది. ఈ పథకంలో ఇటీవల 163 వైద్య చికిత్సలను కొత్తగా చేర్చింది. మొత్తంగా 1,835 చికిత్సలు చేసుకోవచ్చు. ఆరోగ్యశ్రీ కార్డును ఆమోదించే ఆసుపత్రుల్లో మాత్రమే ఉచిత వైద్య పొందే అవకాశం ఉంటుంది. మీ సమీపంలో ఏ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు ఉన్నాయనే సమాచారం ఇకపై మొబైల్ ఫోన్, కంప్యూటర్‌లలో సులువుగా తెలుసుకోవచ్చు.

- కంప్యూటర్ లేదా స్మార్ట్ ఫోన్‌లో ముందుగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పోర్టల్ www.rajivarogyasri. telangana.gov.inలోకి వెళ్లాలి. అనంతరం టాప్ సర్వీస్ బార్‌లో కనిపించే హాస్పిటల్స్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అపుడు రాజీవ్ ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్ అనే దానిపై క్లిక్ చేస్తే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. ఈ మూడు ఆప్షన్ల ద్వారా దగ్గర్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రులను తెలుసుకోవచ్చు. మీరు ఎంచుకున్న ఆప్షన్లపై క్లిక్‌చేస్తే కొత్తపేజీ ఓపెన్ అవుతుంది. మీరు ఎంచుకున్నదాని ప్రకారం సెర్చ్ ఆప్షన్‌లో మీ జిల్లా, మీ మండలం హాస్పిటల్, స్పెషాలిటీ, ప్రభుత్వ లేదా ప్రైవేటుని ఎంపిక చేసుకోవాలి. అనంతరం అందుబాటులో ఉన్న ఆసుపత్రులు కనిపిస్తాయి. ఆసుపత్రి చిరునామా, ఆరోగ్య మిత్ర సభ్యుల పేర్లు, వారి ఫోను నంబర్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద అందించే సేవల వివరాలు చూడవచ్చు.
- ఇంకా ఏమైనా సమాచారం లేదా సందేహం ఉంటే మీరు వెళ్లాలనుకుంటున్న ఆసుపత్రి ఆరోగ్య మిత్ర సభ్యులను సంప్రదించవచ్చు. అక్కడ మీకు కావలసిన వైద్య సేవలు ఉన్నాయో లేవో తెలుసుకొని, సమయం వృథా కాకుండా చూసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రాజు తెలిపారు.

జిల్లాల వారీగా ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల వివరాలు..

కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు కలిపి మొత్తం 52 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, డాక్టర్ భూంరెడ్డి హాస్పిటల్, అమృత నర్సింగ్‌హోం, అపోలోరీచ్, మెడికవర్, సరోజిని హాస్పిటల్, శ్రీరామ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, ఓమెగా సుశ్రుత క్యాన్సర్ హాస్పిటల్, వెంకటేశ్వర కిడ్నీ సెంటర్, చల్మెడ మెడికల్ కాలేజీ, ప్రతిమ మెడికల్ కాలేజీ, సూర్య నర్సింగ్‌హోం, సన్‌షైన్ హాస్పిటల్, సంజీవని నర్సింగ్‌హోం, అక్షయ మల్టీస్పెషాలిటీ, ఆదర్శ హాస్పిటల్, మురుగన్ హాస్పిటల్, శ్రీకృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, రెనీ హాస్పిటల్, వన్ హాస్పిటల్, సీవీఎం హాస్పిటల్, డాక్టర్ శరత్ మ్యాక్స్‌విజన్ ఐ హాస్పిటల్, రిషిక చిల్డ్రన్స్ హాస్పిటల్ జమ్మికుంట, హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి (ప్రభుత్వ), జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్(ప్రభుత్వ)

జగిత్యాల జిల్లాలో..


జగిత్యాల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, గీతా ఆర్థోపెడిక్, మెటర్నిటీ నర్సింగ్ హోం, అమృత, త్రినేత్ర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, సాయి సంజీవని హాస్పిటల్, శివసాయి హాస్పిటల్, పావని ఐ హాస్పిటల్, తిరుమల నర్సింగ్‌హోం, ఓం సాయిరాం మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెట్‌పల్లి (ప్రభుత్వ), ధర్మపురి ఏరియా హాస్పిటల్ (ప్రభుత్వ), కోరుట్ల ఏరియా హాస్పిటల్ (ప్రభుత్వ), రాయికల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ)

రాజన్న సిరిసిల్ల జిల్లాలో...

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, గంభీరావుపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, వేములవాడ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ఎల్లారెడ్డిపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, సిరి హాస్పిటల్, అశ్విని హాస్పిటల్

పెద్దపల్లి జిల్లాలో....

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రామగుండం, మంథని ఏరియా ఆసుపత్రి, పెద్దపల్లి ఏరియా ఆసుపత్రి, సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, విజయ హాస్పిటల్.



రాజన్న హుండీ ఆదాయం రూ. 1.95 కోట్లు

బంగారం 287 గ్రాములు, వెండి 18.5 కిలోలు

వేములవాడ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత నడుమ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 రోజుల హుండీలను బుధవారం లెక్కించారు. నగదు రూ కోటి 95 లక్షల 75 వేల 168 లభించగా, 287 గ్రాముల బంగారం, 18.500 కిలోల వెండి లభించింది. అలాగే నాంపల్లి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో 6 నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ 11 లక్షల 47వేల 510 అదాయం లభించింది. హుండీ లెక్కింపును ఈవో వినోద్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేములవాడలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అంజన్న హుండీ ఆదాయం రూ1.09కోట్లు

మల్యాల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,09,13,339నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. 55 రోజులకుగాను ఆలయంలోని 12 హుండీలను బుధవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 109 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్,అధికారులు, సిబ్బంది, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొండగట్టులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

హుండీల్లోనే బంగారం, వెండి

ఇన్నాళ్లు హుండీలలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండిని తూకం వేయగా ఈ సారి వాటిని తూకం వేయకుండానే సంచిలో సీజ్ చేసి మళ్లీ హుండీలలోనే వేశారు. వాటిని మరోసారి జరిపే హుండీల లెక్కింపు సందర్భంగా దేవాదాయ శాఖ జువెలరీ అధికారుల సమక్షంలో తూకం వేయడానికి గాను సీజ్ చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. గతంలో లేని విధంగా మళ్లీ హుండీలలోనే సీజ్ చేసి వేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యం..

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటన





సిరిసిల్లలో పర్యటిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బృందం, వేములవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్

సిరిసిల్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ ఫలాలు బీసీలందరికి అందించడమే లక్ష్యమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్, గీతానగర్‌లలో పర్యటించారు. పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మలి తదితర కులాల స్థితిగతులను తెలుసుకునే దిశగా వారితో సమావేశం అయ్యారు. తమ్మల కులానికి శూద్ర, నాన్ బ్రాహ్మణ్ పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వడంతో అర్చక, ఇతర ఉద్యోగాల్లో ఇబ్బందులు పడుతున్నామని తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కులం సర్టిఫికెట్‌లలో తమ కులం పేరును వంశీయులుగా మార్చాలని దొమ్మరి కులం బాధ్యులు కోరారు. దొమ్మరి కులం పేరు ఉండడంతో సమాజంలో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వ సంస్థలు, విద్యాలయాల్లో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కులం పేరు సమస్యపైనే అధ్యయనం చేయడానికి వచ్చామని కమిషన్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, తహసీల్దార్ మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, బీసీ సంక్షేమ అధికారి రాజమనోహర్‌రావు, తదితరులు ఉన్నారు.

వెనుకబడిన కులాల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం

వేములవాడ : బీసీ సామాజిక వర్గంలోని వెనుకబడిన కులాలైన పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మల కులాల స్థితిగతులపై రాష్ట్ర బీసీ కమిషన్ సమగ్ర అధ్యయనం చేస్తున్నదని కమిషన్ చైర్మన్ జి నిరంజన్ తెలిపారు. బుధవారం ఆయనతో పాటు కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు న్యూ అర్బన్ కాలనీలో వెనుకబడిన సామాజిక వర్గమైన పిచ్చగుంట్ల కులానికి చెందిన పలువురి ఇళ్లను సందర్శించి వారి జీవన స్థితిగతులను, జీవనోపాధి కోసం వారు పడుతున్న కష్టాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సోషియో ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించి, అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందని వెల్లడించారు. కులం పేరును విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ఇప్పుడున్న కులాల పేర్లకు ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని ఆయా కులాల నుంచి విజ్ఞప్తులు అందాయని తెలిపారు. సమగ్ర అధ్యయనం అనంతరం వచ్చే నెల రెండో వారంలో జరిగే బీసీ కమిషన్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందిన నేపథ్యంలో బిల్లు చట్టరూపం దాల్చాలని రాజరాజేశ్వర స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వచ్చే నెల 3 వరకు

రైల్వే గేటు మూసివేత

కొడిమ్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్-అప్పారావుపేట గ్రామాల మధ్య ఉన్న రైల్వేగేటును మరమ్మతు పనుల దృష్ట్యా గురువారం నుంచి ఏప్రిల్ 3 వరకు గేట్ మూసివేయ నున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ప్రయాణికులు సహకరించాలని బుధవారం సంబంధిత గ్రామ పంచాయతీల అధికారులకు, రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారమందించారు. రైల్వే గేటు మరమ్మతు విషయమై నోటీసు అందినట్లు కొడిమ్యాల తహసీల్దార్ జి.రమేష్, పూడూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి తెలిపారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ..

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు, కరీంనగర్ నుంచి హుజురాబాద్ వైపు వస్తున్న లారీ గట్టుదుద్దెనపల్లి కాకతీయ కాల్వపై ఉన్న వంతెనపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగాలు ధ్వంసం కాగా ఎవరికీ ప్రమాదం జరగలేదు. ప్రమాదంలో ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రాకపోకలను పునరుద్దరించారు.

మార్కెట్ సౌకర్యం లేక మామిడి రైతుల ఇక్కట్లు

రాయికల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

రాయికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలో మామిడికి మార్కెట్ సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లాలో అత్యధికంగా మామిడి తోటల విస్తీర్ణం రాయికల్ మండలంలోనే ఉంది. ప్రతియేటా జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాలకు మామిడిని రైతులు తరలించి విక్రయిస్తున్నారు. స్థానికంగా కొనుగోలు కేంద్రం లేక పోవడంతో రైతులకు రవాణా భారం పడుతోంది. రాయికల్ మండల వ్యాప్తంగా 4300 మంది రైతులు 10,500 ఎకరాల్లో మామిడి పంటలు సాగు చేస్తున్నారు. మూటపెల్లి, కొత్తపేట, భూపతిపూర్, రామాజీ పేట, ఒడ్డెలింగాపూర్, చింతలూరు, తాట్లవాయి, అల్లీపూర్, కిష్టంపేట, సింగరావుపేట గ్రామాల్లో అత్యధికంగా మామిడి తోటలు ఉన్నాయి. ప్రతి యేటా రైతులు విక్రయాలకు పట్టణ ప్రాంతాలకు తీసుకువెళ్లడం, అక్కడ రేటు వచ్చేదాకా వేచి ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగ్‌పూర్ తదితర మార్కెట్‌లలో రేటు వచ్చే దాకా రైతులు జగిత్యాల మార్కెట్‌లో నిరీక్షించాల్సి వస్తుంది. దీంతో పలువురు రైతులు తక్కువ ధరకు విక్రయించి నష్ట పోతున్నారు. రాయికల్ మండల కేంద్రంలో మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కేంద్రం ఏర్పాటుతో రవాణా భారం తప్పడంతో పాటు రాయికల్, మల్లాపూర్, మేడిపల్లి మండలాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని మండల రైతులు కోరుతున్నారు.



మామిడి తోట



రవాణా భారం తప్పుతుంది

రాజేందర్, రైతు, చెర్లకొండాపూర్

మామిడి విక్రయాలకు సుమారు 30 కి.మీ. తీసుకువెళ్లడానికి వాహనాలు సమకూర్చాలంటే సుమారు ఒక్కో వాహనానికి ట్రిప్పుకు రూ.5 వేలు ఖర్చు అదనంగా అవుతుంది. రాయికల్ మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు రవాణా భారం తీరుతుంది.



కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎలగందుల ఉదయశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్

జిల్లాలోనే రాయికల్ మండలంలో రైతులు అత్యధికంగా మామిడి పంట సాగు చేస్తున్నారు. రాయికల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో రైతులకు ప్రయాణ భారం తగ్గుతుంది. మామిడి కొనుగోళ్లకు మండలం కేంద్ర బిందువుగా మారితే రైతులకు ప్రోత్సాహం లభిస్తుంది. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలి.

గుడి లేని దేవుడు

- రాతిపై వెలిసిన ఆదివరాహస్వామి
- ఏటా పెరుగుతూ వరాల స్వామిగా ప్రసిద్ధి
- ఈ నెల 30న ఉగాది సందర్భంగా ఉత్సవాలు

కమాన్‌పూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో వెలసిన ఆదివరాహస్వామి వరాల స్వామిగా భక్తుల కోరికలు నెరవేరుస్తున్నాడు. బండి రాతిపై వెలసిన స్వామివారికి గుడి లేదు. ఆరు బయటనే ఉండి నిత్యం భక్తుల పూజలు అందుకుంటారు. ఏటా స్వామివారి పరిమాణం పెరుగుతున్నట్లు ఇక్కడి భక్తులు చెప్పుకుంటారు. సుమారు 600 సంవత్సరాల క్రితం ఒక మహా రుషి తపస్సును మెచ్చి ప్రత్యక్షమైన శ్రీహరి, ఆ ఋషి కోరిక మేరకు ఆదివరాహ స్వామి రూపంలో వెలసి భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నట్లు ప్రతీతి. స్వామి వారి రాతి విగ్రహం, ప్రతిఏటా పెరుగుతూ వస్తుండడం ఇక్కడి ప్రధాన ప్రత్యేకత. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు మాత్రమే ఆది వరాహస్వామి ఆలయాలు ఉండగా, శ్రీవారు కొలువై ఉన్న తిరుమల ప్రాంతంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్ మండలంలో ఉన్న ఈ ఆలయం రెండోదిగా ప్రాచుర్యం పొందింది.



బండల మధ్యనే ఆదివరాహస్వామి వారి ఆలయం

ఆలయానికి ఇలా చేరుకోవాలి..

స్వామివారిని దర్శించుకోవాలంటే కరీం నగర్ నుంచి గోదావరిఖనికి కమాన్‌పూర్ మీదుగా వెళ్లే ప్రత్యేక బస్సులుంటాయి. కరీంనగర్ నుంచి కమాన్‌పూర్ మీదుగా పెద్దపల్లికి ఆర్టీసీ బస్సులు వెళ్తాయి. దేవాలయానికి దగ్గరగా ఉన్న రైల్వేస్టేషన్ పెద్దపల్లి. అక్క డి నుంచి ఆర్‌టీసీ బస్సులు, ఆటోల సౌకర్యం కూడా ఉన్నది.





రాతిపై స్వామివారు, ఆలయం ముఖద్వారం

ప్రతి మాసంలో కల్యాణం

భక్తుల కోరిక మేరకు ప్రతి మాసంలో కల్యాణం నిర్వహిం చేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ప్రతి మాసంలో ఆదివరాహ స్వామి కల్యాణం నిర్వహించడం వల్ల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. ప్రతి ఉగాదితో పాటు, శ్రావణ మాసంలో స్వామివారి జయంత్యోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో కాంతారెడ్డి తెలిపారు. ఈ యేడు ఉగాదికి ప్రత్యేక పూజలు చేపట్టినట్లు తెలిపారు.

సీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర స్థాయి కాయకల్ప బృందం

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్రస్థాయి కాయకల్ప బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. రాష్ట్రస్థాయి బృందం, సిద్దిపేట జిల్లా నంగునూర్‌లోని సీహెచ్‌సీ వైద్య అధికారులు మంజుల, శ్రావణి, శ్వేత, లిఖితలు ఆరోగ్య కేంద్రంలోని పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్, స్థానిక వైద్యులు అజయ్‌కుమార్, బాబు, రఘు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీహెచ్‌సీని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

28న ఆర్మీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు ఎంపిక

పెద్దపల్లి కల్చరల్, మార్చి 26,(ఆంధ్రజ్యోతి): ఈనెల 28న ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం ఉచిత శిక్షణ అందించేందుకు అభ్యర్థులకు ఫిజికల్, మెడికల్ టెస్టు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం తెలిపారు. సెంటినరీ కాలనీలోని రాణిరుద్రమదేవి స్టేడియంలో ఆర్మీ అభ్యర్థులకు ఉచిత దేహదారుఢ్య, మెడికల్, రాతపరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికి 17.1,2 నుంచి 21సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా స్టేడియానికి వచ్చి పరీక్షలో పాల్గొనవచ్చునని కలెక్టర్ పేర్కొన్నారు.

ఖని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఆర్జేడీ

కోల్‌సిటీటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను వరంగల్ ఆర్‌జేడీ కె.సత్యనారాయణరెడ్డి బుధవారం సందర్శించారు. గాంధీపార్క్ ప్రాథమిక పాఠశాల, గాంధీపార్క్ ఉర్దూ మీడియం పాఠశాలలో నిర్వహిస్తున్న కృత్రిమ మేధ కంప్యూటర్ కేంద్రాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈవో గడ్డం చంద్రయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.రమాదేవి, రఫతున్నీసా పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం చేయాలి

పెద్దపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈ యాసంగిలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను కొనుగోలు చేసేందుకు సరిపడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించేందుకు కార్యాచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ డి.వేణు ఆదేశించారు. బుధవారం ఆయన సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కలెక్టర్ కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం అందించాలన్నారు.

గణిత పరీక్షకు 99.89శాతం మంది హాజరు : డీఈవో

పెద్దపల్లి కల్చరల్, మార్చి 26,(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన పదో తరగతి గణిత పరీక్షకు 99.89శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయిని ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

పెద్దపల్లి రూరల్ , మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి అలివేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ 2024-25కు పెద్దపల్లి మండలానికి ఏడు బ్యాటరీ ఆపరేటర్ స్ప్రేయర్లు , ఏడు పవర్ ఆపరేటర్ స్ప్రేయర్స్ , నాలుగు రోటవేటర్లు, ట్రాక్టర్లతో నడిచే మరో నాలుగు వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. 40 శాతం జనరల్ సబ్సిడీ అలాగే ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా వార్షికోత్సవం

ఓదెల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడిగా గడిపారు. పాఠశాల అభివృద్ధి కోసం స్టూడెంట్ సేవాసమితి ఏర్పాటుతో ఇప్పటికే రూ. 1.40 లక్షలు బ్యాంకులో జమ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే దేశాభివృద్ధి

పెద్దపల్లి రూరల్ , మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం అవుతుందని వన్ నేషన్ వన్‌ఎలక్షన్ జిల్లా కన్వీనర్ సోమారపు లావణ్య అన్నారు. బుధవారం మండలంలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు.

బీజేపీలో నియామకాలు


కోమళ్ల మహేష్, నిర్మల, జనార్దన్‌రెడి

కళ్యాణ్‌నగర్, మార్చి 26(ఆంధ్ర జ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన కోమళ్ల మహేష్‌ను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రు సంజీవరెడ్డి ఉత్తర్వులు అందజేశారు. కోమళ్ల మహేష్ ఆర్‌ఎస్‌ఎస్‌లో ప్రస్తావన ప్రారంభించి ఏబీవీపీ అధ్యక్షునిగా, తెలంగాణ ఉద్యమంలో ఏబీవీపీ నుంచి చురుకుగా పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన కాసగోని నిర్మలను బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలుగా నియమించినట్లు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కృషిచేస్తామని నిర్మల అన్నారు.

● బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షునిగా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ గూడపు జనార్ధన్‌రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి తెలిపారు.

ప్రముఖ హోమియో వైద్యుడు వెంకటేశ్వర్లు మృతి


డా.వెంకటేశ్వర్లు(ఫైల్)

కోల్‌సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన ప్రముఖ హోమియో వైద్యులు వెంకటేశ్వర్లు బుధవారం హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుదీర్ఘకాలంగా లయన్స్‌క్లబ్ ద్వారా సేవలందించారు. మృతి పట్ల స్థానిక వైద్యులు, లయన్స్‌క్లబ్ సభ్యులు సంతాపం ప్రకటించారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

కమాన్‌పూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలుపు అని, మంథని నియోజకవర్గం పెద్దపల్లి జిల్లాలో బీజేపీ ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము అన్నారు. ఈ సందర్భంగా కమాన్‌పూర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. తనపై నమ్మకంతో పెద్దపల్లి జిల్లా బీజేపీ పార్టీ ఉపాధ్యక్ష పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డికి, మాజీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించాలి


మంథనిలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష


ముత్తారం మండలంలోని పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

● కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంథనిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం పర్యటించారు. స్థానిక ఆర్డీవో ఆఫీసులో డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. పట్టణంలో నిర్మిస్తున్న మున్సిపల్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి 163 కింద ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో సేకరించిన భూముల్లో ఉన్న నిర్మాణాలకు నష్ట పరిహారం చెల్లించేందకు చర్యలు తీసుకోవాలన్నారు. బోరు బావులు, చెట్లు, ఇతర నిర్మాణాలకు పరిహార నిధులు ప్రతిపాదనలను సంబంధిత అధికారులు వెంటనే జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపి త్వరగా మంజూరు అయ్యేలా చూడాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు, సర్వే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధి నిర్ధారించాలన్నారు.

చెరువుల భూముల్లో ఆక్రమణలు ఎక్కడైనా జరిగితే వెంటనే రికవరీ చేయించాలన్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా గ్రీనరీ ఉండే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహశీల్దార్ గిరిలు ఉన్నారు.

రెవెన్యూ అధికారులు విధులు పకడ్బందీ నిర్వహించాలి

ముత్తారం : రెవెన్యూ విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షా అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలను, వసతి గృహం, అక్కడ ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. మంథని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్షిస్తూ, జాతీయ రహదారి క్రింద ముత్తారం మండలం లక్కారం గ్రామంలో సేకరించిన భూములలో ఉన్న నిర్మాణాలకు సంబంధించిన నగదు నిర్వాసితులకు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బోరు బావులు, చెట్లు, ఇతర నిర్మాణాలకు పరిహార నిధులు ప్రతిపాదనలను సంబంధిత అధికారులు వెంటనే జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపి త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. డివిజన్ పరిధిలో భూ శుద్ధీకరణ సమయంలో జరిగిన తప్పుల సరిచేసే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు సర్వే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువు భూములలో ఆక్రమణలు ఎక్కడైనా జరిగితే వెంటనే రికవరీ చేయాలని అన్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములకు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. దర్యాపూర్ ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించి పిల్లల డార్మెంటరీ, భోజనశాల, వంటగది పరిశీలించారు. ముత్తారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూసేకరణ పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఆన్లైన్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, ముత్తారం ఎంపీడీవో సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన కలెక్టర్

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని పాండవులగుట్ట ప్రాంతంలో 597సర్వే నంబర్‌లో గల భూమిని బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. 597సర్వే నంబర్లు తహసీల్దార్ జగదీశ్వర్‌రావుతో పాటు ఉప తహసీల్దార్ గర్రెపల్లి శంకర్, రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ భూమి ఎంత ఉందనే విషయంపై సర్వే చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ సర్వే జరుగుతున్న చోటికి వచ్చి తెలుసుకున్నారు. 597సర్వే నంబర్లు 11ఎకరాలు గుర్తించగా భూమి కబ్జా కాకుండా ఫెన్సింగ్ వేయాలని కలెక్టర్ సూచించినట్లు తహసీల్దార్ తెలిపారు.

సీఎం దిష్టిబొమ్మ దహనంపై బీఆర్ఎస్ నాయకులకు నోటీసులు

కోల్‌సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో రెండు రోజుల క్రితం గోదావరి ఎండిపోవడానికి కారణమంటూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మరో నాయకుడు కౌశిక హరి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. దిష్టిబొమ్మ దహనం తరువాత గొడవ జరిగే అవకాశాలు ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పెద్ద సంఖ్యలో సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే బీఆర్ఎస్ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గతంలో ఇదే ప్రాంతంలో దిష్టిబొమ్మల దహనంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహికి దారితీసింది. ఈ సారి మాత్రం ఎలాంటి గొడవలు జరుగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. చౌరస్తా నలువైపులా కాంగ్రెస్ నాయకత్వం ఉన్న సమయంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం కావడం కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారితీసింది. ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సైతం అదే ప్రాంతంలో ఉన్నారు. కాగా ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు 28 మందిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చారు.

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు పోరాట వేదిక


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరావు

పెద్దపల్లి టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం పౌర హక్కుల పరిరక్షణ పోరాట వేదిక ఏర్పాటు చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తెలిపారు. బుధవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముడి మడుగుల మల్లన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ ప్రజా సంఘాలు, అస్తిత్వ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని వేదిక కన్వీనర్లుగా ముడిమడుగుల మల్లన్న, మర్రి వెంకట స్వామి, తాళ్లపల్లి లక్ష్మణ్, వెంకట మల్లయ్య, రాజమల్లయ్య, రామిళ్ల బాపు, జిన్నాం ప్రసాద్, లెనిన్, బాలసాని రాజయ్య, దండు అంజన్న, బాపన్న, సతీష్, కొయ్యడ సృజన్, గుమ్మడి కొమురయ్య, శ్రీపతి రాజగోపాల్, టి.రత్నకుమార్, కె.విశ్వనాథ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం కార్పొరేట్ శక్తులకు అటవీ సంపదను కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఆదివాసీలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయ కులు జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న,పొన్నం రాజమల్లన్న, బొడ్డుపల్లి రవి, పులిపాక రవీందర్, సదానందం ఉన్నారు.

బాధిత కుటుంబాలకు వీహెచ్ఆర్ ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న వీహెచ్‌ఆర్ సభ్యులు

కోల్‌సిటీటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. అంతర్గాం మండలం పరిధిలోని పెద్దంపేటలో బండి ప్రసాద్, మేరుగు కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించగా బుధవారం వీహెచ్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుం బానికి రూ.10వేలు మాజీ జెడ్పీటీసీ ఆముల నారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఆర్థిక సహాయం అందించిన వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాళ్ల హరీష్‌రెడ్డికి బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దంపేట్ మాజీసర్పంచ్ మేరుగు గురువయ్య, బీఆర్ఎస్ నాయకులు మధుకర్‌రెడ్డి, పెద్దంపేట్ వీహెచ్‌ఆర్ సభ్యులు కోడి పుంజుల గురేవేష్, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి సిగిరి రాము, వివిధ డివిజన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ

కోల్‌సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం 90శాతం వడ్డీ మాఫీకి అవకాశం ఇచ్చింది. ఇప్పటికే జీహెచ్ ఎంసీలో వడ్డీ మాఫీ ప్రకటించిన ప్రభుత్వం తాజా గా మున్సిపాలిటీల్లోనూ వడ్డీ మాఫీకి అవకాశం ఇచ్చింది. మార్చి 31వ తేదీలోగా బకాయిలను ఒకేసారి చెల్లిస్తే బకాయిల్లో ఉన్న ఆస్తి పన్ను వడ్డీలో 90శాతం మాఫీ కానున్నది. ఈ మేరకు జీఓ ఆర్‌టీ 154ను ప్రభుత్వం విడుదల చేసింది. వాస్తవానికి బకాయిల్లో అసలు కంటే వడ్డీనే ఎక్కువగా ఉంటుంది. రామగుండంలో మొండి బకాయిల్లో ఎక్కువగా శివారు గ్రామాలు, మురికివాడల్లో ఉన్నాయి. దీర్ఘకాలిక బకాయిల్లో కొన్ని చోట్ల ఆస్తి పన్ను కంటే రెండు మూడు రెట్లు వడ్డీల భారమే ఉన్నది. వీరికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లో అవకాశం లభించనున్నది. రామగుండం కార్పొరేషన్‌లో రూ.3.45 కోట్ల బకాయి ఉండగా ఇందులో 1.67కోట్ల వడ్డీ ఉంది. వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

వైభవంగా పోచమ్మ బోనాలు

ఓదెల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో బుధవారం మహిళలు పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి హాజరై బోనమెత్తుకున్నారు. మాజీ ఎంపీటీసీ పర్శ రమేష్, పుల్ల సదయ్య, మార్క శ్రీనివాస్, మోహన్, సట్ల సదయ్యముంజాల శేఖర్, ముంజాల రవి, పర్శ రాంమ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌ను విమర్శించే అర్హత ఐఎన్‌టీయూసీ నాయకులకు లేదు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌ను విమర్శించే అర్హత ఐఎన్‌టీయూసీ నాయకులకు లేదని యూనియన్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 3,400 మంది డిపెడెంట్లకు ఒకేదఫాలో ఉద్యోగాలు ఇప్పించిన ఘనత బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌లకు దక్కుతుందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను అత్యంత క్లిష్టమైనా కారుణ్య నియామకాల పేరిట అమలు చేసింది బీఆర్ఎస్ అని ఐఎన్‌టీయూసీ నాయ కులు గుర్తుంచుకోవాలని సూచించారు. 14,000 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు బీఆర్ఎస్ హయాంలో వచ్చాయని, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ల ద్వారా 4,800 ఉద్యోగాలు భర్తీ జరిగినట్టు అయిలి శ్రీనివాస్ తెలిపారు. ప్రమాద వశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.20 లక్షలు, ఆన్ డ్యూటీలో సహజ మరణం చెందితే రూ.15 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చేలా ఒప్పందం చేసుకున్న ఘనత టీబీజీకేఎస్, బీఆర్ఎస్‌దని పేర్కొన్నారు. 16 శాతం నుంచి 32 శాతానికి లాభాల వాటా ఇప్పించడం, విద్యుత్ చార్జీల రద్దు, 10 లక్షల వడ్డీలేని గృహ రుణం ఇప్పించడం వంటి అనేక చరిత్రాత్మక ఒప్పందాలు బీఆర్ఎస్ హయాంలో జరిగినట్టు అయిలి శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌లపై విమర్శలు చేయడం సరికాదని అయిలి శ్రీనివాస్ పేర్కొన్నారు.

జీడీకే 2, 2ఏను సందర్శించిన డీడీఎంఎస్


అధికారులతో కలిసి గనిలోకి దిగుతున్న డీడీఎంఎస్ వెంకన్న

గోదావరిఖని, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీడీకే 2, 2ఏ ఇంక్లైన్‌ను డీడీఎంఎస్ బీ వెంకన్న బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా భూగర్భ గనిలోని పని స్థలాలను తనిఖీ చేశారు. భూగర్భ గనిలో ఎస్ఎస్ 13/2 ప్యానెల్ పనిస్థలాన్ని సందర్శించి పైకప్పు, సైడ్లను భద్రతతో కూడిన రక్షణ చర్యలను సూచించారు. పటిష్టమైన సపోర్ట్ చేయాలని అధికారులకు, సూపర్‌వైజర్‌లకు తెలిపారు. ఈ మధ్యనే డబ్ల్యూసీఐఎల్, సీఐఎల్‌లో రూఫ్, సైడ్ ఫాల్ ప్రమాదాలు సంభవించాయని తెలిపారు. అటువంటి వాటికి ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గనికి సంబంధించిన సర్వే రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఏరియా రక్షణాధికారి బీ సాయిప్రసాద్, ఏజెంట్ కే చంద్ర శేఖర్, అధికారులు డీ రమేష్‌బాబు, ఎస్‌కే అల్లావుద్దీన్, డీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జీడీకే 11ఇంక్లైన్‌లో రికార్డు స్థాయిలో ఉత్పత్తి

గోదావరిఖని, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీడీకే 11ఇంక్లైన్ 65వేల టన్నుల బొగ్గు డిస్పాచ్ టార్గెట్ ఉండగా ఆరు రోజుల ముందే 66,901.82 టన్నుల బొగ్గు డిస్పాచ్ సాధించారు. ఉత్పత్తి 103 శాతంగా ఉంది. ఈ సందర్భంగా అధికారులను, ఉద్యోగులను ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్‌కుమార్ బుధవారం అభినందించారు.

నేడు సుల్తానాబాద్‌లో ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

సుల్తానాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం సాయంత్రం ప్రార్థనల అనంతరం సుల్తానాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే విజయరమణారావు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారని సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ అమీనొద్దీన్ నన్ను ఒక ప్రకటనలో తెలిపారు. నీరుకుళ్ల రోడ్డులోని ఎస్‌వీ ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎమ్మెల్యే ఇవ్వనున్న ఇఫ్తార్ విందుకు మండలంలోని ముస్లిం సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అమీనొద్దీన్ పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

పెద్దపల్లిటౌన్: విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ కంకటి మాధవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు లైన్‌లలో కెపాసిటర్ బ్యాంకులు 16 బిగించినట్లు వివరించారు.

ఎలిగేడు: మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత 11పాఠశాలలకు మధ్యాహ్న భోజన కార్మికులకు వంటపాత్రలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసినట్లు ఎంఈవో అనసూరి నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ గంగ్ర దేవేందర్‌రావు, ధూళికట్ట హెచ్‌ఎం బిజిలి సదయ్య తెలిపారు.

ఎలిగేడు: ఆధునిక ప్రాచీన పద్ధతుల ద్వారా మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిస్సిక్రిష్టాన అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆధునికత నుంచి ప్రాచీన పద్ధతుల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం అనే కార్యక్రమం సందర్భంగా మాట్లాడారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఆపిల్‌కిడ్స్ పాఠశాలలో బుధవారం గోదావరిఖని పట్టణంలో ఉమాశంకర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

కమాన్‌పూర్ : కమాన్‌పూర్ మండల కేంద్రంలోని స్వయంభు క్షేత్రమైన ఆదివరాహస్వామి హుండీ ఆదాయం బుధవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 5,15,694 వచ్చినట్లు పెద్దపల్లి దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఈవో కొనన కాంతారెడ్డి పేర్కొన్నారు.

మంథనిరూరల్: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శశికళ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు.

రామగిరి: మండల పరిషత్‌కు కూతవేటు దూరంలో ఉండే రత్నాపూర్ పంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో పారిశుధ్య లోపించింది. ఏ వీధిలోకి వెళ్లినా చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. డీఎల్‌పివో దృష్టి సారించాల్సిందిగా స్థానికులు వేడుకుంటున్నారు.


పాలకుర్తి : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన గుంపుల తిరుపతి(50) కరీంనగర్‌లోని ఓ ప్రైవేటుఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపారు.

ఓదెల: మండలంలోని పొత్కపల్లి వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న సిరిసేటి వసికర్ అనే విద్యార్థి చొప్పదండి నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మ్యాడగోని కిషన్, ఉపాధ్యాయులు తెలిపారు.

రామగిరి: కృష్ణవేణి టాలెంట్ పాఠశాల ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న మండలంలోని బేగంపేట్ సాయి ప్రగతి పాఠశాల విద్యార్థి ఈర్ల విక్రమాదిత్యకు 6వ తరగతిలో ప్రవేశానికి నవోదయలో చోటు లభించింది. విద్యార్థికి కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్లశ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మారం: తెలంగాణ మత్స్యకార్మికుల డైరీని పెద్దపల్లి జిల్లా మత్స్య శాఖ అధికారి నరేష్ బుధవారం ఆవిష్కరించారు. పెద్దపల్లి జిల్లా కార్యదర్శి బొల్లారపు రమేష్, ధర్మారం మండల గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుమ్ముల నర్సయ్య పాల్గొన్నారు.

సింగరేణి అధికారి ఆకస్మిక మృతి


రాజు(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 వెల్ఫేర్ ఆఫీసర్ మాథ్యూ పాగోల్‌రాజు బుధవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందాడు. ఓసీపీ-3 కార్మికులు, అధికారులు, యూనియన్ నాయకులు ఏరియా ఆసుపత్రిలో రాజు మృతదేహానికి నివాళులు అర్పించారు. ఓసీపీ-3 కార్మికులతో మమేకమై పనిచేసిన అధికారిగా గుర్తింపు పొందారని, మాథ్యూ పాగోలు రాజు మరణం బాధాకరమని సీఐటీయూ బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మాథ్యూ పాగోలు రాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు ఏఐటీయూసీ నాయకులు రాజారత్నం, జిగురు రవీందర్, అన్నారావు పేర్కొన్నారు.